క్లుప్తంగా

కనులపండువగా వెంకటేశ్వరుని కల్యాణం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణాన్ని మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు కనులపండువగా నిర్వహించారు. ఈ కల్యాణంలో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పొగ మంచుతో వాహనదారుల ఇక్కట్లు



గుడ్లవల్లేరు: చలి ప్రభావం రోజురోజుకు పెరిగిపోతోంది. ఉదయం కూడా పొగ మంచు తీవ్రంగా ఉండడంతో వాహన చోదకులు హెడ్ లైట్లు లేకుండా ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. దూరంగా ఉన్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనపడకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

కొండలమ్మకు పాల పొంగళ్ల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మహిళలు పాల పొంగళ్లను పొంగించి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

మెగా ఉచిత వైద్యశిబిరం




గుడివాడ టౌన్: పట్టణ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక నీలామహల్ రోడ్డులోని కాపు కల్యాణ మండపం ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరంలో విజయవాడ మణిపాల్, అను ఆస్పత్రికి చెందిన వైద్యబృందాలు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాపు సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు నరహరశెట్టి ప్రసాదు, ఎ. మల్లేశ్వరరావు, కోశాధికారి రామారావు, పూర్వ అధ్యక్షులు పి. రామకృష్ణ, ఎస్.గాంధి, ఎస్. రాజేష్, వెంకట్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఎన్‌సీసీ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో దేశసేవ చేసేందుకు ఎన్‌సీసీ క్యాడెట్‌లకు అవకాశం దక్కుతుందన్నారు. ఎన్‌సీసీలో పూర్తి శిక్షణ పొందిన వారికి ఎ, బి, సి సర్టిఫికెట్లు అందజేస్తారని వాటికి ఎంతో విలువ ఉంటుందన్నారు. సర్వీస్ సెలక్షన్ బోర్డు ద్వారా ఆర్మీలోకి డైరెక్ట్‌గా చేరేందుకు ఈ సర్టిఫికెట్లు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఆసక్తి గల వారు ఎన్‌సీసీలో చేరి క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పలు పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఎన్‌సీసీ క్యాడెట్లకు బి, సి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎండీ సలీమ్ పాల్గొన్నారు.

బుడమేరులో పడి వ్యక్తి మృతి



నందివాడ: నందివాడ మండలం కుదరవల్లి గ్రామానికి చెందిన నందమూరి ఇశ్రాయేలు (51) ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు బుడమేరులో పడి మృతి చెందాడు. పశువులకు గడ్డి కోసేందుకు వెళ్లి కాలు జారి బుడమేరు కాలువలో పడి నీట మునిగి ప్రాణాలు విడిచారు. ఇశ్రాయేలుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నందివాడ ఎస్‌ఐ కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షోభం



మండవల్లిలో శిథిలమైన హాస్టల్ భవనం



ఎస్సీ బాలికల వసతి గృహ అద్దె భవనం

శిథిలావస్థలో బాలికల వసతి గృహం

మండవల్లి: మండవల్లి ఎస్సీ బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరింది. 40 మంది బాలికలు ఉండే ఈ హాస్టల్ భవనం వర్షం పడే సమయంలో పరిస్థితి దారుణంగా మారుతుంది. దాదాపు అన్ని గదుల్లోనూ వర్షం పడుతుండటంతో బాలికలకు రక్షణ లేకుండా ఉంది. గత్యంతరం లేక వేరొక భవనం నెలకు రూ. 6 వేలుకు అద్దెకు తీసుకుని కొనసాగిస్తున్నారు. పగటిపూట శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనంలో బాలికలు ఉంటారు. రాత్రి భోజనాలు అయిన తర్వాత అద్దె భవనంలోకి వెళతారు. వర్షం పడినప్పుడు అన్ని గదులలో వర్షం పడుతుండడం వల్ల అద్దె భవనంలోకి వెళ్లి బాలికలు తలదాచుకుంటున్నారు. రాత్రి వేళల్లో బాలికలు ఇలా వెళ్లడం ఏంటి? అని వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు లేక అవస్థలు

హాస్టల్ నుంచి హైస్కూల్‌కు వెళ్లేందుకు రోడ్డు సక్రమంగా లేక విద్యార్థినులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే వర్షం నీటితో పాటు డ్రెయినేజీ నీరు కూడా చేరి ఆ నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడుతుందని బాలికలు వాపోతున్నారు. ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి హాస్టల్ భవనం నిర్మించడంతో పాటు హాస్టల్ వెళ్లే రోడ్డును కూడా సరిచేయించాలని బాలికలు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా ఎస్సీ బాలికల వసతి గృహ రహదారి

హాస్టల్‌ను అభివృద్ధి చేయాలి



ఎస్సీ బాలికల హాస్టల్ అభివృద్ధికి నోచుకోక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. భవనంలోని అన్ని గదులలో వర్షం కురుస్తుండడంతో బాలికలకు రక్షణ లేకుండా పోయింది. బాలికలందరూ రాత్రి వేళల్లో అద్దె భవనంలోకి వెళ్లడానికి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వం హాస్టల్ భవనాన్ని అభివృద్ధి చేసి బాలికల సమస్యలను పరిష్కరించాలి.

– బాదిన సామియేలు బాబు, పెరికెగూడెం

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు: దాతలు ఇస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలని ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ తమ్మా లలిత గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏఎస్ఎం హైస్కూల్ ఆవరణలో పామర్రు మండల రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మండలంలోని పేదలైన విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థిక చేయూతగా నగదు ప్రోత్సాహకాలను అందించి వారి విద్యకు తోడ్పాటు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. 26 మందికి నగదు ప్రోత్సాహకాలను అందజేశామని తెలిపారు. అంతే కాకుండా 23 మంది వృద్ధులను గుర్తించి వారికి నెలకు రూ.1,000 చొప్పున ఏడాది వరకు పెన్షన్ అందించామన్నారు. దాతలు ఆరుమళ్ల శివన్నారాయణ రెడ్డి, బొమ్మారెడ్డి రామనాథరెడ్డి, బొమ్మారెడ్డి వెంకట సుధాకర్‌రెడ్డి, గుజవర్తి భరత్‌రెడ్డి, బొమ్మారెడ్డి వెంకట శివరామకృష్ణారెడ్డి, కొల్లి రామకృష్ణారెడ్డి, పొట్లపల్లి వెంకట కోటిరెడ్డి, కొల్లి అనంత ప్రధాన రెడ్డి, మోరా నాగిరెడ్డి, నారాయణరెడ్డి, ఎన్‌శివ ప్రసాద్‌రెడ్డి, మావులూరి శ్రీనివాసరెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహించామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలను అందజేసిన ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ లలితా గోవర్ధన్‌రెడ్డి

ఐక్యతతోనే సహాయసహకారం

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: కాపులు ఐక్యతను చాటుకుని సహాయసహకారాలు అందించుకోవాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావుతో కలిసి కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కాపు కార్తిక వనసమారాధనలో ఆదివారం పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కురేళ్ల జ్యోతి శిష్యబృందం ప్రదర్శించిన భారతనాట్యం ఆకట్టుకుంది. విశ్రాంత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ చదువులో రాణించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్‌ను డీఎన్నార్, కమ్మిలి సత్కరించారు. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి సుమారు 10,000 మంది భోజనాలు చేశారు. కార్యక్రమంలో సామాజికవర్గ పెద్దలు చిట్టూరి మురళీ, తెలగంశెట్టి శ్రీనివాసరావు, దూలం వినయ్, శ్యామ్, వసుంధర మురళీ, అద్దంకి వెంకట శ్రీనివాసరావు, అన్నం రాంబాబు, రామకృష్ణ, ఆంజయులు, నాగు, హనుమా తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో మాజీ ఎమ్మెల్యే వేదవ్యాస్‌ను సన్మానిస్తున్న డీఎన్నార్ తదితరులు



దత్తాశ్రమంలో దీపోత్సవం



పామర్రులో శివలింగాకారంలో వెలిగించిన దీపాలు

• ఘనంగా దీపోత్సవం

పామర్రు: స్థానిక విజయవాడరోడ్డులోని బుచ్చమ్మ ఆశ్రమంలోని మల్లికార్జున సమేత భ్రమరాంబదేవి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం రాత్రి శివలింగాకారం, స్వస్తిక్, పద్మం తదితర ఆకారాల్లో భక్తులు దీపాలను వెలగించారు. ఆలయ అర్చకులు కార్తీక్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

దత్తాశ్రమంలో..

కైకలూరు: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం ఏలూరురోడ్డు దత్తాశ్రమం వద్ద కార్తిక దీపోత్సవం నిర్వహించారు. దత్తాశ్రమ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, కనకదుర్గ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు కార్తిక వనసమారాధన భోజనాలు చేశారు. మంచు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, భక్తులు హరిమోహన్, దాసరి శ్రీనివాస్, గాదంశెట్టి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్ల ధ్వంసం

గుడ్లవల్లేరు: పల్లెల్లో ప్రజాధనంతో రోడ్లను నిర్మిస్తున్నారు. అయితే ఆ రోడ్లను దమ్ము చక్రాలతో వచ్చే ట్రాక్టర్ల డ్రైవర్లు అనాలోచితంగా ధ్వంసం చేస్తున్నారు. కనీసం ఆ దమ్ము చక్రాలకు రోడ్లకు రక్షణగా రబ్బరు బీడింగ్‌ను కూడా ఏర్పాటు చేసుకోవటం లేదు. కాగా దమ్ము చక్రాలతో రోడ్లను ధ్వంసం చేస్తే జరిమానా తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.



దమ్ము చక్రాలతో రోడ్ల ధ్వంసం

విద్యార్థులకు వైద్యపరీక్షలు

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక దనియాల పేటలోని ప్రణవాశ్రమ విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మంది విద్యార్థులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేకించి పిల్లల దంత వైద్య నిపుణురాలు డాక్టర్ టి. రమ్యభావన ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు దంతాలు తోముకునే విధానం, శుభ్రంగా ఉంచుకోవాల్సిన పద్ధతులను వివరించారు. దంత సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారులకు తమ వైద్యశాలలో ఉచిత సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎన్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, జి.నరేష్, ఎం.రమణమూర్తి, ఏజే ప్రసాద్ పాల్గొన్నారు.

నరసయ్య మాస్టారుకు సత్కారం

కైకలూరు: ప్రముఖ కవి, రచయిత, ఇంగ్లిష్ మాస్టారు దివ్వెల నరసయ్యను కైకలూరు వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ అధ్యక్షుడు గురజాడ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన వ్యక్తులను సన్మానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ దండు రంగరాజు, కారి శరత్‌బాబు, బందెల లక్ష్మణరావు, ఆనంద్, శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ కొనుగోళ్లలో భాగస్వాములను అరెస్ట్ చేయాలి

గుడివాడ టౌన్: జాతీయ స్థాయిలో జరిగిన విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలలో కుంభకోణాలకు పాల్పడిన నాయకులతోపాటు అందుకు కారకుడైన అదానీని అరెస్ట్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. తొలుత స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి కమ్యూనిస్ట్ నాయకులు ర్యాలీ నిర్వహించి నెహ్రూచౌక్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, టి.లక్ష్మణరావు, పి. రజిని, ఆర్.కొండ, ఎల్. సురేంద్ర, విజయ్‌కుమార్, వెంకట్రావు పాల్గొన్నారు

కార్తికేయుని ఆలయానికి పోటెత్తిన భక్తజనం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం భక్తజన సందోహంతో కోలాహలంగా మారింది. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగలిశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మోపిదేవిలో స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచియున్న భక్తులు

ఆటపాకలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కైకలూరు: ఆటపాక పక్షుల విహార కేంద్రం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కార్తికమాసం ఆదివారం కావడంతో ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల అందాలను దగ్గర నుంచి వీక్షించారు. కేంద్రం వద్ద పక్షి నమూనా మ్యూజియాన్ని సందర్శించారు. సమీపంలోని చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. అటవీశాఖ సిబ్బంది కొల్లేరు పక్షుల విశేషాలు, భౌగోళిక పరిస్థితులను వివరించారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన

పమిడిముక్కల: తాడంకి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం కార్తిక వనమారాధన ఉత్సాహంగా సాగింది. జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ యేనుగ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో తాడంకి, మంటాడ, గురజాడ, గోపువానిపాలెం, మద్రివాడ గ్రామాల నుంచి రెండు వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. తొలుత ఉసిరిచెట్టుకు పూజలు చేసి, చెన్నకేశవ స్వామిని దర్శించుకున్నారు. అన్నసమారాధనను మస్తాన్‌రావు ప్రారంభించారు. సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి శ్రీలక్ష్మి, గుర్విందపల్లి వంశీ, ఆలయ ఈఓ జన్ను వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, కొణతం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తాడంకిలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దాత యేనుగ మస్తాన్‌రావు

గరికపర్రులో..

పామర్రు(తోట్లవల్లూరు): ఉయ్యూరు వైఖానస శాఖ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం తోట్లవల్లూరు మండలం గరికపర్రు వేణుగోపాల స్వామి ఆవలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. నిమ్మకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు, రాధాదేవి దంపతులకు లక్ష్మీ నారాయణ పూజ చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పరాశరం రామకృష్ణమాచార్య పాకయాజీ బిరుదాంకితులు రచించిన సత్య ప్రచార గ్రంథమాల 'శాంతి కల్యాణం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉయ్యూరు శాఖ ప్రధాన కార్యదర్శి ముత్తేవి యోగ లక్ష్మీ శ్రీనివాస్, కోశాధికారి పరాశరం యోగానంద సత్యమూర్తి, సమన్వయకర్త అంజనీకుమార్, గౌరవాధ్యక్షుడు వేదాంతం సేతు మాధవాచార్యులు పాల్గొన్నారు.



గరికపర్రులో లక్ష్మీనరసింహాచార్యులు, రాధాదేవి దంపతులకు సన్మానం

గుడివాడలో..

గుడివాడ టౌన్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో పలు ప్రాంతాల్లో కార్తిక పూజలు, వనసమారాధనలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వీరశైవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక పూజల్లో కంభాల మల్లికార్జునరావు–శ్రీదేవి, హేమ కృష్ణప్రసాద్–లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, చంద్రశేఖర్, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం లింగాల విశ్వేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండవల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అర్చక స్వామి భవానిశంకర్ ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరులో రజక సామాజికవర్గ కార్తిక వనసమారాధన ఆ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. అత్తిలి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య పాల్గొని రజకులందరూ ఐక్యతను చాటుకోవాలన్నారు. లావేటి వీరశివాజీ, పూలా రామచంద్రరావు, వెంకటేశ్వరరావు రామకృష్ణ, పోలవరపు సత్యనారాయణ, ఏవి.కోటేశ్వరరావు, ధర్మారావు పాల్గొన్నారు.

గోపాలపురంలో

కలిదిండి మండలం గోపాలపురం గ్రామ దేవస్థానం వద్ద ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకాని కోటేశ్వరావు, నాగ సుబ్రహ్మణ్యం, నాగలక్ష్మీ, ఉప సర్పంచ్ నరసింహారావు పాల్గొన్నారు.



గుడివాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కైకలూరులో రజక వనసమారాధనలో పాల్గొన్న ప్రముఖులు

ప్రత్యేక శిబిరాలతో ఓటర్లకు మేలు

గుడ్లవల్లేరు: మండలంలో ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఓటర్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలు మేలు చేకూర్చాయని సూపర్‌వైజర్ పి.శివకుమార్ అన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆయనతో పాటు ఆదివారం రీసర్వే డీటీ జాలాది రత్నకుమారి, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, మండల రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ చిరంజీవి పరిశీలించారు. ఓటర్ల నమోదు చేర్పులు, మార్పుల ప్రక్రియపై జరిగిన విధానాన్ని బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మండలంలోని 57 పోలింగ్ స్టేషన్లలో ఈ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాల్లో 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు 50 మంది నమోదు చేసుకున్నారన్నారు. ఏడుగురు ఓటర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. చేర్పులు మార్పుల కోసం 80 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. వీఆర్వోలు శాయన ప్రకాష్, ఎంవీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉన్నత సమాజం కోసం కృషి

మండవల్లి: ఉన్నత సమాజం కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మానవత మండల అధ్యక్షుడు గుడివాడ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ మానవత ద్వారా వేలాదిమందికి ఆర్థిక సాయంతో పాటు నెలవారీ సరుకులు మార్చురీ ఫ్రీజర్ బాక్సులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అల్లినగరం గ్రామానికి చెందిన మెరుగు మరియమ్మ, మండవల్లి చెందిన దేవాది శ్రీనివాసరావుకు నిత్యావసరాలు అందజేశారు. పెరికెగూడెం గ్రామానికి చెందిన మానవత కార్యవర్గ సభ్యుడు ఎలికే రాంబాబు ప్రతి నెలా ఐదు కేజీల బియ్యం అందజేస్తానని తెలిపారు. ముళ్లపూడి సత్తిబాబు, బొల్లెంపల్లి కృష్ణ, సమయం ఏసుబాబు, సుదర్శనం గౌతమ్‌కుమార్, కిన్నెబాబు పాల్గొన్నారు.

ఆ రోడ్డులో ప్రయాణం నరకప్రాయం



గోతుల్లో వాహనాల రాకపోకలు



భయభయంగా ద్విచక్రవాహనదారుడి ప్రయాణం

గుడ్లవల్లేరు: కూరాడ–ముదినేపల్లి ప్రధాన రహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రత్యక్ష నరకం కనబడుతోంది. ఆ రోడ్డులో రాత్రి సమయంలో రాకపోకలు సాహసోపేతంగా మారాయి. ద్విచక్రవాహనదారులు గతుకులు, గోతుల్లో పడిపోయి మోచేతులు, మోకాళ్లకు గాయాల పాలవుతున్నారు. అదే దారిలో నాలుగు రోజులు కారులో ప్రయాణిస్తే.. కారుతో పాటు ప్రయాణించేవారు షెడ్డుకు వెళ్లాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.